కథ

# మరో కోణం

-శ్రీలక్ష్మి

ఆ రోజు ఆదివారం.

దూరదర్శన్‌లో నేషనల్ ఇంటగ్రేషన్ మీద సంగీత కార్యక్రమం ప్రసారమవుతోంది. ఇరవై మూడు సంవత్సరాల యమున. సంగీతం వినే వేలాది ప్రజల మనసులను ఆనందంతో రంజింపచేస్తోంది.

ఆడియన్స్‌లోంచి మాత్రమే కాక ఆ అరగంట ప్రోగ్రామ్ చూస్తున్న వారంతా కూడా లయకనుగుణంగా తాళం వేస్తూ మన తెలుగువారి అమ్మాయి, మన ఆడబడుచు అంటూ మనసులోనైనా అభినందించ కుండా ఉండలేకపోయారంటే ఆశ్చర్యమేముంది.

వింటున్న సువర్చల "అరె.మన యమున" అంటూ గబగబా ఫోన్ రిసీవర్ తీసుకుని ఒక నెంబర్ డయల్ చేయసాగింది.

"హల్లో! శాంతీ, కంగ్రాచ్యులేషన్స్. ముందుగా చెప్పావు కావేం. మన యమున ప్రోగ్రాం ఉందని."

"అదా! రికార్డింగ్ మూడు నెలల క్రిందటే అయింది. మద్రాసు తెలుగు అకాడమీ వాళ్ళు రికార్డ్ చేసారు. కానీ కరెక్ట్‌గా ఏరోజు వస్తుందో నాకు తెలీదు. బహుశా వాళ్ళు యమునకు తెలియపరచి ఉంటారు." అని ఒక్క క్షణం ఆగి... "యమున... ఇప్పుడు ఇక్కడ లేదుగా" అంది. "అదేంటి?" ప్రశ్న గొంతులోనే ఉండగానే, "రేపు ఖాళీయే కదా. కలుద్దాం" అంటూ అవతల్నించి రిసీవర్ పెట్టేసిన సౌండ్ విని సువర్చల తెల్లబోయింది.

శాంతిని కలిసేలోగానే సువర్చల తెలిసిన వాళ్ళకూ, తెలియని వాళ్ళకూ కూడా "ఈరోజు ప్రోగ్రాం యమున అని మాకు బాగా తెలిసిన వాళ్ళమ్మాయిది." అని విపరీతమైన ఎగ్జైట్‌మెంట్‌తో చెప్తోంది.

"అయితే కావచ్చుగానీ. నీకు తెలిసింది చాలా తక్కువ. ఇంకా చెప్పాలంటే అసలు నీకేం తెలీదోయ్." అంది శారద.

"మీ" ఏంటి తెలియనిది" దబాయించింది సువర్చల.

"ఆ అమ్మాయి వాళ్ళ గురువుగారితో చాలా చనువుగా ఉంటోందిట తెలుసా!"

వింటూనే ఛర్రున లేచింది సువర్చల.

"నోర్మూయ్. ఆ అమ్మాయి ఎంత మంచిదో నాకుతెలుసు.చిన్న వయసులో అత్యున్నత సోపానాలు అందుకోవాలంటే రాత్రింబవళ్ళు ఎంత సాధన అవసరమో నీకు తెలుసా. అందులో సంగీతానికైతే మరీను. నేను ఎప్పుడు శాంతీ వాళ్ళింటికెళ్ళినా యమున అలాపన అలా అలా తేలి వస్తూనే ఉండేది. అప్పుడే అనుకున్నాను. ఎప్పటికైనా ఈ అమ్మాయికి మంచి భవిష్యత్తు ఉందని." ఆయాసంగా ఆగింది.

"కావచ్చుకానీ! ఒక పురుషుడి అభివృద్ధి వెనుక ఒక స్త్రీ ఉండి తీరుతుందన్నది ఎంత నిజమో, ఒక స్త్రీ ఉన్నత సోపానాలు అందుకోవాలన్నా పురుషుడి అండ ఉండి తీరాలి అన్నదీ అంతే నిజం" శారద తన వాదనను బలపరచుకుంటూ అంది.

"నేను యమున విషయంలో నమ్మలేకపోతున్నాను."

"కాదులే సువర్చలా! యమున గురువుగారింటికి రాకపోకలు, అతని ఫోటో ఆమె ఆల్బంలో పెట్టుకొని పూజించడం.... ఇవన్నీ..."

మామూలు ప్రైవేటుకి వెళితేనే గంట చాలదు. డిప్లొమో అయి, మ్యూజిక్‌తో పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చి, ఇంకా సంగీతం పట్ల తీరని దాహంతో రేయింబవళ్ళూ కృషి చేసే యమున గురించి అంతమాట అనడం నాకు నచ్చలేదు. అందుకే "శారదా! నువ్వు యమునని అర్థం చేసుకోలేకపోతే ఊరుకో. వాళ్ళిద్దరికీ అలాంటి సంబంధం నేను కలలో కూడా ఊహించను" అంటూ ఒక్క క్షణం ఆలోచించి "వాళ్ళిద్దరికీ.... ఆ గురుశిష్యులిద్దరికీ కరెక్ట్ సామ్యం తేవాలంటే 'శంకరాభరణం' చూసావా! అందులో తులసికీ, శంకరశాస్త్రికీ ఉన్న సంబంధమే వీళ్ళిద్దరిదీను" అంది సువర్చల అక్కడితో సంభాషణను తుంచేస్తూ.

శారదతో సంభాషణను తుంచేసినా సువర్చల యమున గురించి ఆలోచిస్తూనే ఉంది. మర్నాడు ఎంత వేగిరం వెళ్లి శాంతిని కలుద్దామా అని.

క్లుప్తంగా శాంతి జీవితం గురించి చెప్పాలంటే అగ్రకుటుంబంలో పుట్టి, నిమ్న కులస్థుణ్ణి పెళ్ళి చేసుకున్నందుకు అయిన వాళ్ళు వెలివేసారు. వ్యస నాలకు బానిసై నా భర్త మరణించిన తర్వాత ముగ్గురు పిల్లల్ని పెంచడానికి, ఆర్థికంగా నిలదొక్కు కుందుకు ఉద్యోగం చేస్తూ ఈ సమాజంలో పెరిగేం దుకు అవసరమైన ధైర్యసాహసాలు పిల్లలకు నూరి పోస్తూ గడుపుతోంది. అయితే అలాంటివాళ్ళకు సాయం చేసేందుకు ముందుకు వచ్చే వాళ్ళు లేకున్నా, రాళ్ళు విసిరేవాళ్ళకు లోటేముంది?

*　　　*　　　*

కాలింగ్‌బెల్ నొక్కి లోపలకు అడుగుపెట్టబోతున్న సువర్చల యమున సంగీత కార్యక్రమం వీడియో రికార్డింగ్ చూస్తూ కూర్చున్న శాంతి లేచి నిలబడి "రా! సువర్చలా! ఆపాట చూడు. హిందూ ముస్లిం సమైక్యతను ప్రతిఫలింపచేస్తూ" అంది.

లోపలకు అడుగుపెట్టి ఒక కుర్చీలాక్కుని కూర్చుంటూ "రివైండ్ చేయకూడదూ! మొదటి నుంచీ చూస్తాను" అంది.

పరిచయ వాక్యాలు "కుమారి యున కర్ణాటక సంగీతంలో ... గారి శిష్యురాలు. ఆమె సంగీతంలో..." టక్కున ఆపేసింది శాంతి "సువర్చలా! నీ సందేహాలూ,నువ్వు నన్నుఅడగబోయే ప్రశ్నలూ ఊహించగలను. రహస్యాలు దాచుకుంటే ప్రాణస్నేహానికి అర్థమే లేదు. "సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ. అది నీకు సుఖ దుఃఖాలలో తోడు నీడేనోయీ" అన్న వాక్యంలో ఎంతో నిజముంది.

"సువర్చలా! ఆ పరిచయ కర్త చెపుతున్నట్లు యమున కుమారి కాదు. ప్రపంచం దృష్టిలో కుమారేకానీ... కళాకారులకుండే బలహీనత అదేనేమొ. వాళ్ళు సరిగ్గా నిలద్రొక్కుకోకుండానే తప్పటడుగులు వేస్తారు. అధః పాతాళానికి నెట్టివేయబడతారు. ఇంక అక్కడినుంచీ చేయూతనిచ్చి లేవతీసేవాళ్ళుండరు."

"అంటే! యమున వాళ్ళ గురువుగారితో... ఊళ్ళో వాళ్ళంతా అనుకుంటున్నది నిజమేనా?" ప్రశ్నించింది సువర్చల.

మౌనంగా తల ఊపింది శాంతి.

"ఎందుకిలా చేసింది? అసలు దాని వయసెంతని? అయినా అతగాడికి బుద్ధుండక్కర్లా" ఆవేశంగా అడిగే ప్రశ్నలకు మౌనమే సమాధానంగా కంటినీరు వ్రేలికొసలతో తుడుచుకుంటూ తలదించుకుంది శాంతి. "యమున అడ్రస్" అంటూ కాగితం అందించి టి.వి. ఆన్ చేసింది.

*　　　*　　　*

"యమునా! చిన్నప్పటి నుంచీ మీ అమ్మ సమాజంలో తనకంటూ ఒకస్థానాన్ని ఏర్పరచుకోవడానికి అనుభవించిన బాధలూ నాన్నగారు లేని లోటూ, అది మీకు ఇసుమంతైనా తెలీకుండా మిమ్మల్ని పెంచడానికి, మీకో వ్యక్తిత్వం ఏర్పడాలని ఆరాటపడే హృదయం నాకు తెలుసు.కానీ నువ్వేమిటి ఇలా? అమ్మ నాదగ్గర ఏదీ దాచదు" వింటున్న యమున చిరునవ్వుతో.

"సువర్చలాంటీ! మీరన్నీ సీరియస్‌గా తీసుకుంటారు. గోరంతలు కొండంతలు చేసుకొని బాధపడతారు. మీకు తెలుసుగా చిన్నప్పటి నుంచీ. సంగీతం నా



అరో(ప్రాణమని."

"అయితే."

"దానికోసమే నా ఆరాటం, తపన. కొన్ని విషయాలు కొందరికి అత్యంత విలువైనవిగా కన బడితే మరి కొందరికి అవే విషయాలు పూచికపుల్లతో సమానంకావచ్చు. నాకు తెలిసిన దగ్గర్నుండీ మా మాష్టారే నాకు ప్రత్యక్షదైవం... అన్నీను." చెప్తూన్న యమున ఆగింది ఒక్కక్షణం.

మిగతాది చెప్పడానికి సిగ్గుపడుతోందో, తను చేసిన పనికి పశ్చాత్తాపపడుతోందో సువర్చలకు అర్థం కాలేదు.

"ఆంటీ! అవిశ్రాంతంగా రేయీ పగలూ సాధన తర్వాత సాధంన చెయ్యడానికి ఇది సినిమా కాదుకదా! జీవితం. ఇందులో కొన్ని బలహీనతలూ ఉంటాయి.. నా సంగీత సాధన అద్భుతంగా సాగుతోంది. చూస్తున్నావుగా పేరు ప్రఖ్యాతులు" వింటున్న సువర్చల తృళ్ళిపడింది.

మయునేనా! ఎంత తేలిగ్గా, సింపుల్‌గా చెప్తోంది.

"అయితే మరి పెళ్ళి..." సగంలో ఆపేసింది సువర్చల. ఆప్రశ్నకు ఒక్క క్షణం యమున మొహంలో రంగులు మారి, నిరాశ తొంగి చూసింది.

"లేదాంటీ! ఆ పనిమాత్రం నేను చేయలేను. ఎందుకంటే ఇది కేవలం మా ఇద్దరికీ సంబంధించిన వ్యవహారం. పెళ్ళంటే, అది అతని కుటుంబానికంతకూ, సమాజంలోని అతని గౌరవ మర్యాదలకూ సంబంధించిన వ్యవహారం. అందుకే నేను ఇలాగే ఉండిపోతాను."

"అయితే, భవిష్యత్‌లో నువ్వు పెళ్ళే చేసుకోవా!" సువర్చల ప్రశ్నకు అంతవరకూ సీరియస్‌గా ఉన్న యమున నవ్వేస్తూ,

"ఎందుకు చేసుకోను! ఇరవై నాలుగ్గంటలూ సంగీత సాధనలో మైమరచిపోతూ, ఉడికీ ఉడకని అన్నం పెట్టినా సర్దుకుపోగలిగే మగవాడే దొరికిన నాడు అతడికి నాలోని ఈ చిన్నలోపం చంద్రునిలో మచ్చలాగానే భావించి ఆదరించగలిగే సహృదయత ఉంటుందనే భావిస్తాను. ఆంటీ, ఇంటర్వ్యూ ముగిసినట్టేనా! లేద్దామా మరి." నవ్వుతూన్న యమునని విభ్రమంగా చూసింది. ఈ శతాబ్దపు చివరి దశలో జీవితం పట్ల తననుకున్నది సాధించడం పట్ల, ఆధునిక యువతిలో వస్తున్న మార్పుకి ఆశ్చర్యపోతూ ఆమెనే చూస్తూండి పోయింది సువర్చల. ❒